కథానిక

# ఎదురీత

కె. వి. రమణ

చల్లనిగాలి తిరిగింది. మధ్యాహ్నపు సూర్యుని వేడి కిరణాల ఉధృతం తగ్గింది. సుబ్బారావు కిటికీ తలుపులు బిగించి పడుకొనేవాడే కాని ఆ స్థితిలో శరీరాన్ని కదపటం తనకు శక్యమయ్యేపని కాదనుకొని ఆ ప్రయత్నం మానుకొన్నాడు. శరీరమంతా చెమటతో తడిసినా నిద్రపోగల శక్తిగల మనుష్యులకి ఉదాహరణ తనేనని అప్పుడప్పుడు మిత్రులతో అని తనే నవ్వుకొనేవాడు. ఆవేళలో నిద్రపోవటం అసలు అతనికి అలవాటులేని పని. సాధారణంగా కొబ్బరికొట్టు వరండామీద బల్లదగ్గర కూర్చునివచ్చే హైదరాబాదు వర్తకులకు, తనకు వచ్చీరాని హిందూస్తానీలో, తన షాహుకారు తరఫున కబుర్లుచెప్పి కొబ్బరి వేగన్లు అంటగట్టే ఉద్యోగం తనది.

దానిలో తనకేదో తెలియనిఆనందం సంతృప్తి. కొంచెం తల ఖాళీగావున్న వర్తకుడు దొరికితే చాలు సుబ్బారావుకి పండుగదినం. రెండో, మూడో వేగన్లు మంచి ధరకు అమ్మాడంటే, ఆ సాయంత్రం ఆ పరమోత్సాహంతో యింటికివచ్చి కండువా వంకీని తగిలించి వంటింట్లోని భార్యతో తనేవిధంగా యీ ఘనకార్యాన్ని సాధించిన వైనమంతా చెప్పేవాడు. ఈ సొదలో ఆమె చారులో పూర్తిగా వుప్పు వెయ్యటం కాని, అన్నంలో పసుపు కలుపుట కాని అలవాటే. ఐనా సుబ్బారావుకి అంత పట్టించుకొనే తీరికా వుండదు. కారణం ఏమంటే ఈ సంగతి ఆ రాత్రే తన అరుగుమీద నూనె దీపంచుట్టూ మూగే ఊరి పెద్దలకు "బ్రాడ్ కాస్టు" చెయ్యవలసిన పని వుంది కనుక. ఏ రోజునైనా తనకి మంచి బేరాలు కుదరకపోతే షాహుకారుచేత చప్పగా చివాట్లు తిని యింటికి మెల్లిగా జేరుకొని మెదలకుండా పిల్లాడి తొట్టి వూపుతూనో లేక తన గదిని తానే మరీమరీ శుభ్రం చేసికొంటూనో కాలం గడపటం అలవాటు. [illegible]

గ్రహించినట్లు కనపడకుండా వుండటానికి చేసే ప్రయత్నాలు సుబ్బారావు పరీక్షించి చూస్తే గ్రహించేవాడే!

కిటికీలోంచివచ్చే చల్లనిగాలి అతను నిద్రలో కోల్పోయిన ప్రాణాలను తీసికొచ్చింది. బద్ధకంగాలేచి ఒళ్లు విరచుకొంటూ "మలయమారుతం" అంటే యిదే కాబోలు ననుకొన్నాడు. అందుకనే ఆ కవులు ఊరికే అంతంత ఉద్గ్రంథాలు రాయలేదు. మన యింట్లోకే యింతవస్తే రాజసౌధాల్లోకి మరీ ఎక్కువై వుండాలనుకొన్నాడు. శాశ్వతంగా రాజా స్థానాలలోవుండే కవులను, ముఖ్యంగా ముక్కు తిమ్మనను జ్ఞప్తికి తెచ్చుకొని ముఖం చిట్లించుకొన్నాడు. పక్కమీది దుప్పటీగుమ్మంముందు తివాసీరూపం పొందిందన్న సంగతి యిప్పుడు గుర్తించే స్థితిలోలేడు. మెల్లిగా ఒళ్లు విరచుకొంటూ లేచి మళ్ళీ తలగడాను దగ్గరసా లాక్కొని మూడంకె వేశాడు. ఎంత బాగుందో అనిపించింది. తలగడాను ఎడం చేతి వేళ్ళతో నొక్కాడు మెల్లిగా. గట్టిగా అట్టలుకట్టిన దాని శరీరంలోంచి గప్పున ఘాటైన సువాసన వచ్చి అతని నాశికారంధ్రాలను చుట్టుముట్టినా అతనేం లెక్కచెయ్యలేదు. 'నిరుపహతి స్థలంబో రమణీమణి...ణి...'మరి జ్ఞాపకంలేదు. "ణీ"ని కొంచెంసేపు దీర్ఘంతీసి ఆలాపనచేసి తన గురువుగారైన లక్షణ శాస్త్రిగారిని జ్ఞాపకం చేసుకొన్నాడు. సంగీతంలో తల నెరసిన పండునని సుబ్బారావు జేబులో డబ్బులున్నాయని తెలిసినప్పుడల్లా స్వశ్లాఘనఘట్టాలను తెరచి, అతన్ని తన రాగాలాపన శక్తితో తబ్బిబ్బులుచేసి నశ్యం కొనుక్కొని ఠీవిగా త్యాగరాజ పంచకట్టుతో నడచిపోయిన ఆయన విగ్రహం జ్ఞాపకమొచ్చింది. మనసులోనే ఆ మహానుభావునికి జోహారనుకొన్నాడు. చేతులు కలిపి దండంపెట్టాలనే [illegible] అవి తలగడను వదలి రానందు

వల్ల మనసులోనే నమస్కరించాడు. "హృదయం ప్రధానమైతే చేతలెందుకోయ్" అనే తన షాహుకారు చిరునవ్వు మొహం గుర్తుకొచ్చింది. ఎప్పుడైనా అనుకోని యిబ్బందివచ్చి షాహుకారుని పదిరూపాయిలు చేబదులు యిమ్మంటే ఆయన బదులుచెప్పే సంతృప్తిశ్లోకం అది. భగవద్గీత చదవాలనిపించింది ఒక్కసారి... చిన్నతనంలోనే నాన్న చచ్చిపోయాడు. అప్పుడునాన్న "నా జీవితమంతా వేదపారాయణకి అర్పించానురా-యింక నీకెల్లా తగలబడినా నాకేం బాధలేదు" అన్న మాటలు గుర్తుకివచ్చి మరి దానిజోలికి పోలేదు. అయినా యిప్పుడు ఆ గీతజోలికెందుకులే అనుకొన్నాడు. ఎందుకో "ప్రాంచద్భూషణ బాహు"...హు...హూ అని కూనిదీర్ఘంతీసి కళ్ళుఎత్తి యింటి పైకప్పుకేసి చూసాడు. నవ్వొచ్చింది. తాతయ్య కట్టించిన యిల్లు. ఈవూరి జమీందారు తాతయ్య పాండిత్యాన్ని మెచ్చి ఈ వూరు రప్పించి యిల్లుకట్టించి యిచ్చాడు. "నేనీ వూరికి అల్లుడినిరా" అని తాతయ్య అనే మాటలు నాన్న చెబుతూ వుండేవాడు. సుబ్బారావు యీ యింటి కట్టుదిట్టాలగురించి భార్యతో తరచు అనేవాడు. అతనికదో అభిమానం. ఆ యిల్లు కట్టిన తర్వాత మరామత్తు రాకపోవటం అతనికి గర్వకారణం. ఈ మధ్య భార్య "వర్షం కురుస్తోందండీ - కప్పువేయించాలి"అని అన్నట్లు అస్పష్టంగా గుర్తువుంది. కాని తనేం అంతగా పట్టించుకోలేదు. మళ్ళీ యీ ప్రసంగం రాలేదు. మొన్నటి వరదలకి రాజమండ్రీలోని పెద్ద మేడలే కొట్టుకుపోయాయని విన్న సుబ్బారావుకి తన పెరటి వాకిలి గోడ నానిపోవటం దూడలశాల కూలిపోవటం కష్టం కలిగించలేదు. పైగా దూడలంటూ తనకు లేకపోయాయికాని వుంటే అవి నిష్కారణం చచ్చిపోయేవని ఆలోచించి ఆ రోజంతా విచారించాడు. భార్య ఓదార్చకపోతే కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చేవే!

ప్రక్కనవున్న దుప్పటీతీసి కప్పుకోవాలనుకొన్నా చేతులు ఆపని చెయ్యటానికి నిరాకరించటంవల్ల పాదాల బొటనవేళ్ళ సాయంతో మెల్లిగా లాగి నడుందాకా కప్పుకొన్నాడు. ఎందుకోనవ్వొచ్చింది. మొన్నఓరోజున కొట్టుపని ముగించుకొని వస్తుంటే ఆ సందులో సంధ్యచీకటి కిటికీలోంచి ఆకుపచ్చనిచీర అమ్మాయిని అతను.. గట్టిగా నవ్వాడు సుబ్బారావు. మళ్ళీ సిగ్గుపడ్డట్టు తలగడాక్రింద తలదూర్చి ఓరకన్నుతో యింటి కప్పుకి ఎన్ని చిల్లులున్నాయా అన్నట్లు చూసాడు. చేతులతో తలగడ మరీదగ్గరగా తీసికొని... అటూ యిటూ ఎవరైనా ఉన్నారేమోనని భయంవేసి, గుండె కుదుటపర్చుకొని పెద్దపెద్ద అంగలు వేసికొంటూ యిల్లు చేరకొనేసరికి భార్య చెమటతోనిండిన తన మొహాన్నిచూసి కంగారు పడటం గుర్తించనేలేదు.

తొట్టిలోని పిల్లాడి కేక వినపడింది. ఆడుకొంటూ కేకలేస్తున్నాడేమో ననుకొన్నాడు. మెల్లిగా ప్రారంభించిన రాగాన్ని సప్తమస్వరంతో ఆలాపన చేస్తున్నాడు. మొదట తలగడామీద వ్రేళ్ళతో తాళంవేసినా, ఆ నాదం పెద్దదయేసరికి శ్రుతికలియక చిరాకుపడి తలపైకెత్తి భార్య ఏమయిందా అని ఆలోచించాడు. తలుపులు చేరవేయబడివున్నాయి. ఆవిడ పెత్తనాలికి వెళ్ళివుంటుంది. యీ అమ్మాయికి కొద్దిగా చదువురావటం తన కొంపతీసింది అనుకొన్నాడు. పక్కింటి ముత్తైదువులకి ఈమె .భాగవత రామాయణాల అర్థాలు చెప్పేపని ప్రతిసాయంత్రం. ఒకసారి ఇల్లాగే తను నిద్రనుంచి లేచేసరికి దాహంవేసి భార్యని పిలిపిస్తే పలకలేదు. ఏం తోచిందో గట్టిగా అరిచాడు. ఆమె కంగారుపడి పరుగెత్తుకువచ్చి సంగతితెలిసికొని అంత ఉడుకుబోతుతనం ఎందుకో అని అనడం విని ఒళ్లు మండుకొచ్చింది. కొడదామని చెయ్యి ఎత్తాడుకాని ప్రక్కింటి కొత్త కోడలు వయ్యారంగా తనప్రక్కన నిల్చొని "మా బావగారికి ముక్కుమీదే కోపం"అని చిలిపిగా మొహం పెట్టి నవ్వడంతోటి తనకే ఏదో జ్ఞప్తికివచ్చి "సరదాగా అన్నానులే" అన్నాడు ఆమెతో. భార్య ఈ మాటలువిని తనని లోకువకడుతుందని భయపడి మళ్ళీ ఒక్కసారి "అల్లా భయపెట్టకపోతే...ఆడవాళ్ళు రాక్షసులు"అని సిద్ధాంతీకరించాడు. ఆ అమ్మాయి మౌనంగా వూరుకోవటం చూసి బాధపడివుంటుందని గ్రహించి "మీకు కోపంవచ్చిందా"అని దీనంగా అన్న తనగొంతుక యిప్పటికీ మరచిపోలేదు. పెద్దపని మునిగిపోతు

న్నట్లు తన భార్యే ఆ అమ్మాయి రెక్కపుచ్చుకొని లాక్కుపోతూంటే, ఆమె తనకేసిచూస్తూన్న దృశ్యం జ్ఞాపకమొచ్చింది... ముసుగు గట్టిగావేసుకొని సుబ్బారావు అర్థచంద్రాకారంలో, నవ్వుకొన్నాడు. పిల్లవాడి గోల మరీ పెద్దదయింది. చిరాకుగా దుప్పటీ ప్రక్కకినెట్టి ఒంటిబద్ధకం తీర్చుకొంటూ ఉయ్యాల దగ్గరకి వచ్చాడు. యిల్లంతా కలియచూశాడు. భార్యలేదు ప్రక్కయింటివారి అరుగుమీద అలికిడీ లేదు. తొట్టె వూపటం యిగ్గా మంచిదనితోచి, వూపుతూ జోలపాడాలని పెదిమలు గుండ్రంగాజేసి నాలికతో ఎంత సాధకంచేసినా, చాతనవలేదు. అయినా జోలపాడటం ఆడవాళ్ళపని అనుకొని తృప్తిపడ్డాడు.

పిల్లాడి మొహంలోకిచూసి నవ్వాడు. ఇల్లంతా ప్రతిధ్వనించిందన్న సంగతి గుర్తించలేదు కుర్రాడి కళ్ళు ఆదోవిధంగా కనపడ్డాయి. బాగా చిక్కిపోయి, ఏడాది పిల్లాడు నెల పురిటిపాపలా వున్నాడు- అన్న భార్యమాటలు జ్ఞప్తికివచ్చాయి. "డాక్టరుగారి యింటిదగ్గరనుంచి ఆదీర్తి కట్టడానికి మాత్రలు తేవాలండీ" అని రెండురోజులనుంచీ భార్య జ్ఞాపకంచెయ్యటం, తను తీరికలేకనో, చీకటిపడటంవల్లనో, యింటికి తొందరగారావటం జరిగిపోతోంది. ఒకరోజు మధ్యాహ్నం ఒకగంట తీరికచేసికొని డాక్టరుగారి టికి వెళ్ళగా ఆయన లేరని చెప్పిన కాంపౌండరుని మాత్రలు అడగటానికి సంకోచించాడు. ఒకనాడు షావుకారు యింటిలో మందుకై వెళితే "మందులు-మందులంటే ఎక్కణ్ణుంచొస్తాయయ్యా- ఫీజు యిచ్చేటప్పుడు ఈ శ్రద్ధ ఎక్కడ అణిగిపోతుంది" అన్న కాంపౌండరు మాటలు బుర్రలో గింగురు మెతూనే వున్నాయి. తన సంగతి ఏమంత ఎక్కువ అనుకొన్నాడు. డాక్టరుగారు, తననాన్న ప్రాణస్నేహితులట. చిన్నప్పుడు ఒక కంచంలో తినేవారని అమ్మ చెప్పేది. చిన్నప్పుడు తనకి జబ్బుచేసి ఐదుసార్లు క్రిందపెట్టినప్పుడు ఈ డాక్టరుగారే కళ్ళలో వొత్తులుపెట్టుకొన్నట్లు తెలవార్లుజాగరం చేసి తనని బ్రతికించాడని అమ్మే చెప్పేది. పెద్దవాడయినతర్వాత సుబ్బారావు తరచు ఆయనదగ్గరికి వెళ్ళటమే లేదు. అందులో అమ్మపోయిన తర్వాత మరీ వెళ్ళటం తగ్గించాడు. తను చిల్లిగవ్వ అయినా డాక్టరుకి ముట్టచెప్పలేక పోయానని తలచి సిగ్గుతో క్రుంగిపోయాడు. కాంపౌండరు తనని పలకరిస్తాడేమోనని అరగంట చూసాడు. తనకేసి చూసికూడా అసహ్యించుకొన్నట్లు అతని కళ్ళలో సుబ్బారావుకి గోచరించింది. షావుగారు చెల్లుబాకీ కనుక్కొని త్వరగా రమ్మన్న ఆజ్ఞ జ్ఞాపకంవచ్చి కండువా దులిపి త్వరత్వరగా నడచి వచ్చేడు కొట్టుదగ్గరికి. ఇంటికిరాగానే భార్యతో అదే తగ్గిపోతుందిలే అని నవ్వేసేవాడు. కాని నిన్న ఆమె విచారంగా కళ్ళనీళ్లు పెట్టటం చూస్తే తనకే బాధకలిగింది. జేబులో కానీకూడ లేదు. నిన్న ఆ క్రొత్తగావచ్చిన వర్తకునితో కాఫీ హోటలుకుపోయి జేబులు ఖాళీ చేయించుకు వచ్చాడు. తీరా అతను బేరంచెయ్యకుండానే బస్సు ఎక్కాడు.

పిల్లాడిని వూపుతూ ఉండటంకంటె కష్టమైన పని మరొకటి లేదనుకొన్నాడు. భార్యని గట్టిగా తిట్టుకొన్నాడు. తనని నిందించుకొన్నాడు. తొందరగా లాల్చి కండువా వేసుకొని సాయంకాలమైపో


## పాత్రుడుగారి
# బాలసంజీవిని
**(Regd.,)**

పిల్లల లివర్ & స్ప్లీను వ్యాధులను నివారించును.

**డాక్టరు పిల్లా పాపయ్యపాత్రుడు అండ్ బ్రదర్స్**

19 దక్షిణ మాడవీధి-మైలాపూరు
మదరాసు-4. ఫోన్ నెం. 85254

బ్రాంచి:-7, సారంగపాణికోవిల తూర్పువీధి
కుంభకోణము.

అన్ని మందులషాపులలోను దొరుకును

యుందని గుర్తుకొచ్చి పెద్ద అంగలు వేసుకొంటూ కోర్టుకి బయలుదేరాడు. బాగా సాయంత్రం ఐంది. కోర్టు దగ్గరికి వెళ్ళేసరికి తలుపు తాళంవేసివుండటం ఆశ్చర్యం కలిగించింది. ఏం చెప్మా! కారణం అని వూహించాడు. తను ఈ రోజున ఊరికి వెళుతున్నాడు కనుక కోర్టుకి సెలవు అని షావుకారు చెప్పటం గుర్తుకువచ్చింది. అసలు అందుకనే కదా తను మధ్యాహ్నం భోజనం తర్వాత సంతృప్తిగా సాయంకాలంవరకూ పడుకోవాలని అనుకొన్నది. జ్ఞాపకశక్తి తగ్గిందేమోనని అనుమానం వచ్చింది. దీని అభివృద్ధికి పాలు వెన్న పళ్లు బాగా తినాలని ఎప్పుడో చిన్నప్పుడు తోటి విద్యార్థి చదువుతుంటే నిద్రలో మగతగావిన్నట్లు జ్ఞాపకం. సైన్సు మాష్టారు జ్ఞాపకంవచ్చారు సుబ్బారావుకి. అట్లతిదియరోజున ప్రయివేటుక్లాసు పెట్టినందుకు కోపంవచ్చి ఆ రాత్రి పిల్లలందరూ ఆయనప్రక్కనిండా పల్లేరుకాయలు వేయటం గుర్తుకొచ్చింది. పాపం! ఆయన భార్య ముందుగావచ్చి మంచం మీద పడుకోనగానే, కెవ్వున కేకవేసి క్రిందకు దొర్లిపడటం, పిల్లలందరూ పరుగెత్తుకు వచ్చి ఈ దృశ్యంచూసి నవ్వు ఆరికట్టలేక అక్కడినుండి పారిపోవటం కళ్ళముందు కనపడ్డాయి. సుబ్బారావుకి నవ్వువచ్చింది. పెదిమలదాకా.—అక్కడే ఆగిపోయింది. తనకి నవ్వే ఓపిక లేదని తెలిసికొనే స్థితిలోకూడ లేడిప్పుడు, కాళ్ళీడ్చుకొంటూ ఇంటి ముఖం పట్టాడు. అయినా డాక్టరుగారి యింటికి వెళ్ళి మాత్రలు తీసికొందామనిపించి వారి వీధి వైపు తిరిగాడు. ఆ సందు మలుపులోనే ఆయన కనపడి తనంతట తనే సుబ్బారావుని పిలవటం పరమ సంతోషాన్ని కలిగించింది. రెండు చేతులూ యెత్తి నమస్కరించాలని కోర్కె కలిగినా.— ఎందుకులే నమస్కారం అని బద్ధకించాడు. దగ్గరగా వెళ్ళి ఆయన ప్రక్కన తలవొంచుకు నిలబడ్డాడు. డాక్టరుగారి ఎడంచెయ్యి బరువుగా తన నడ్డిమీద నాట్యంచేస్తోంది. ఎంతమంచివారు ఈయన. ప్రపంచంలో యీయనలాంటి మహానుభావులున్నారు కనుకనే జబ్బులుచేసి అంతా చచ్చిపోవటంలేదు అనుకొన్నాడు.

'ఏమోయ్ సుబ్బారావ్!' డాక్టరుగారి బొంగురు గొంతుక అతని కదిల్చింది. ఆయన అంటున్నాడు. 'నీవు వూళ్ళోలేనట్లు మాత్రలకని ఎండలో ఆడకూతుర్ని పంపావేమిటి?' ఈమాటలు వినడానికి సుబ్బారావు సిద్ధంగాలేడు. మాత్రలకి భార్యవస్తుందని వూహించలేదు. తనతో చెప్పనైనాలేదు. సిగ్గువిడచి ఎండలో ఒక్కత్తే వస్తుందా? తలతీసినట్లు భావించాడు. మొహం నిండా చెమటబిందువులు కనపడ్డాయి. డాక్టరుగారికి సమాధానం చెప్పాలనుకొని ఏమీతోచక ఏదో అనబోయి కంగారు పడ్డాడు. ఆయనే బుజంమీద చెయ్యితీసి "మాత్రలు యిచ్చి పంపానులే. మరేమీ కంగారులేదు కుర్రాడికి-పోయిరా" అని తనేదోపనిమీద వెళ్ళిపోయాడు.

నెత్తిమీదినుండి సగంబరువు తీసినట్లనిపించింది సుబ్బారావుకి. డాక్టరు కనుమాపుమేర దాటే వరకు బిత్తరపోయిచూస్తూ, తర్వాత అంగలు వేసుకొంటూ యింటికిముఖంపట్టాడు. జీవితాంతం వరకూ బుద్ధివచ్చేటట్లు భార్యకి బుద్ధిచెప్పాలనుకొన్నాడు. తను గుట్టు ఏటినికొట్టుకొపోయిందని భావించాడు. తను చేతకానివాడని భార్య యీ విధంగారుజువుచేయటంతలచి చీదరించుకున్నాడు. లజ్జవిడిచి డాక్టరు దగ్గరకి, తనతో చెప్పకుండా రావటం అసహ్యమనిపించింది. తనే వస్తాదనని, మొగుడుపనికిరానివాడనితలచి బయలుదేరింది. మరీ యింత మిన్నుముట్టితే ఇంక ఆడవాళ్లేమిటి అనుకొన్నాడు. ఈ జాతిని నాశనంచెయ్యాలనే మెరుపులాంటి తలంపు వచ్చినా అది తనపనికాదన్నట్లు మొహం చిన్నది చేసికొన్నాడు. గుమ్మంలో అడుగుపెట్టకూడదు. అనుకొన్నా— భార్యకి బుద్ధిచెప్పటం ముఖ్యంకనుక తొందరగా వెళ్ళాలనుకొన్నాడు. రోడ్డంతా కృంచుకుపోయినట్లు సుబ్బారావు యింటిసమీపానికి వచ్చాడు. తన యింటి అరుగుమీద వీధి పెద్దమ్మలంతా మూగటం కనపడింది సుబ్బారావుకి. వారిమధ్య భార్య-ప్రక్కన దీపం. దిక్కుమాలిన పురాణానికి రాత్రిపగలులేదు కాబోలు! అని గట్టిగా కసురుకొన్నాడు. కాని మాటలు గొంతుకలోనే అంతమయ్యాయి. ఇంటి గుమ్మంలోకి వచ్చాడు- చుట్టూ అందరూ ఆమెను ఓదారుస్తున్నారు. భార్య చేతిలో చిట్టిపాప అదోలా పడుకుని వున్నాడు...